సరిగ్గా పది గంటలకు-

ఫోన్ రింగయింది. ఆ రూమ్‌లో, టేబిల్ చుట్టూ కుర్చీల్లో కూర్చొని వున్న నలుగురూ ఉలిక్కి పడ్డారు. ప్రశ్నార్థకంగా నొసలు చిట్లించి, ఒకరి మొహం ఒకరు చూసుకున్నారు. అందరి ముఖాల్లోనూ కించిదాశ్చర్యం.

"తప్పకుండా రాణి వద్ద నుంచే అయ్యుండాలి" అనుకుంటూనే స్థిమితం లేని చేతుల్తో ఫోను ఎత్తేడు శంకర్. "హలో" అన్నాడు.

"హలో! హలో! ఎవరు? డైరెక్టరు సార్. మీరేనా?"

అంత అయోమయంలోనూ, ఆ గొంతు హీరోయిన్ రాణి ఇంట్లో పని పిల్ల చెల్లమ్మదిగా గుర్తించాడు శంకర్. అనుకున్నట్లే రాణి వద్ద నుంచి. కాని చేసేది రాణి కాదు. రాణి యింట్లో ఫోన్ లేదు. హీరోయిన్‌గా ఆవిడకిదే మొదటి సినిమా. ఇంకా ఫోన్ పెట్టించుకునే స్థితికి రాలేదు. తనెవరికి ఫోన్ చేసినా, పబ్లిక్ బూత్ నుంచో, తెలిసిన వాళ్ళ ఫోన్ ద్వారానో! మరి యీ చెల్లమ్మకి అంత అవసరం ఏం వొచ్చింది?

"నేనే!" అన్నాడు ఆలోచిస్తూనే.

"సార్! సార్... అమ్మగారు... అమ్మ... రాణెమ్మ సార్..."

కంఠ స్వరాన్ని బట్టి చెల్లమ్మ ఏడుస్తోందన్న విషయం అర్థమైంది.

"ఏమైంది? ఏమైంది చెల్లమ్మా?" కంగారుగా అడిగేడు.

మిగతా వాళ్ళు కళ్ళు పెద్దవి చేసి గుచ్చి గుచ్చి చూసేరు - తమ సినిమా విషయమేమోనని...

"సార్... డైరెక్టరు సార్... అమ్మగారు చచ్చి పోనారు సార్..."

"వాట్?" కుర్చీలోంచి ఎగిరి పడ్డాడు.

"అను సార్... నిండా సత్యం సార్... అమ్మగారు చచ్చి..."

శంకర్ చేతిలోంచి ఫోను జారిపోయింది. అతను నిశ్చేష్టుడై పోయేడు. మిగతా ముగ్గురూ "ఏమైంది? ఏమైంది?" అంటూ శంకర్ భుజాలు పట్టుకొని వూపుతున్నారు. అతనికి ఒక పట్టాన మాట పెగలం లేదు.

* * *

చీకట్లు చిక్కబడుతూ, వెలుగును మింగుతున్న మునిమాపు వేళ రాణి మట్టిలో కలిసిపోయింది. చీకటిని పారదోలే దీపపు వెలుగులా తన జీవితంలోకి ప్రవేశించి, దోవ చూపి మళ్ళీ కనబడకుండా పోయిన ఆమెను తల్చుకుని ఏడవడానికి కూడా శక్తి లేనంతగా మెదడు స్తంభించినట్లయింది శంకర్‌కి.

* * *

పది, పన్నెండేళ్ళుగా - ముప్ఫయి సినిమాలకు పైగా, ప్రఖ్యాత సూపర్ హిట్ డైరక్టర్లుగా పేరు బడ్డ నలుగురి వద్ద పని చేశాడు శంకర్. లక్షల కొద్దీ డబ్బు వెదజల్లే భారీ చిత్రాలను తీసే వీళ్ళలో ఏ ఒక్కరైనా సిఫార్సు చేసి తనకో చిన్న బడ్జెట్ సినిమా, ఏ చిన్న నిర్మాతతోనో ఇప్పిస్తారేమోనని ఆశతో, శతథా ప్రయత్నించేవాడు.

ఒకాయన "చూద్దాం నెక్స్ట్ పిక్చర్ తర్వాత" అనే వాడు.

ఇంకొకాయన "ఏరోయ్, ఏళ్ళ తరబడి వున్న వాళ్ళకే దిక్కు లేదు. వచ్చి రెండేళ్ళు కాలేదు. అప్పుడే సూపర్ డైరక్టరై పోదామనా?" అన్నాడు.

మరొకాయన "ఎంతో శ్రమ, దీక్ష, పట్టుదల, ఓర్పు, నేర్పు"లాంటి మాటల కూర్పుతో అదరగొట్టి వదిలి పెట్టేడు.

శంకర్‌కి మంచి వర్కర్ అన్న పేరుంది. సిన్సియర్ అనే గాకుండా ఎవ్వరినీ పల్లెత్తు మాట అనే వాడు కాదు. విసుగనేది కన్పించేది కాదు.

సినిమా జనం పైకి రావడానికి ఎన్ని అవతారాలెత్తుతారో, అవన్నీ ఎత్తేడు. పన్నెండేళ్ళ తర్వాత బూతుల డైరక్టర్‌గారు పిల్చి "వారే! రెండో యూనిట్‌ని చూసుకోరా!!" అని చెప్పాడు. అప్పటికి ఆయన - తాగీ తాగీ లివరూ, తిరిగీ తిరిగీ వొళ్ళూ చెడిపోయి వున్నాడు. సెకండ్ యూనిట్ డైరెక్టర్లా బాగానే చేశాడు. ఆ సినిమా ఏవరేజ్!

ఆయన తర్వాత సినిమాకి "కో-డైరక్టర్ నువ్వే" అని చెప్పి సినిమా సగంలోనే బాటిల్ తన్నేశాడు. ఎలాగో తంటాలు పడి రీళ్ళు చుట్టేసినా ఆ సినిమాలో సహం తర్వాత కంటిన్యూటీ లేక - కాలం చెల్లిపోయింది.

తర్వాత ఏడాది పాటు - అటు అసిస్టెంటుగానూ ఎవరూ తీసుకోక, ఇటు దర్శకుడిగా అవకాశాలు లేక - అజ్ఞాతం. ఆ ఏడాది పాటు ఒట్టిగా కూర్చోలేదు. కనపడ్డ వాడి కాళ్ళూ చేతులూ గడ్డాలూ పట్టుకున్నాడు. చచ్చి చెడి చాయం గల విన్నపాలు చేసుకున్నాడు.

ఎన్నో రాత్రులు - ఆకలి, నిస్పృహ, నిరాశ,నిస్సత్తు: కసి, పస్తులు......

సినిమా ప్రపంచం చిత్రమైంది. అది బయట వున్న వాళ్ళని ఒక పట్టాన తనలోకి రానియ్యదు. తనలో వున్న వాళ్ళని - ఆకలికి మాడి చావనిస్తుంది గాని బయటికి పోనివ్వదు. ఆ సుడిగుండంలో గుడు గుడు గుంచాలాడుతూ ఒక్కసారి పైకెగసే వారుంటారు. మరి కొందరు అడుగు పెట్టి నామ రూపాల్లేకుండా పోతుంటారు. భద్రత లేని జీవితాలు.

ఇహ లాభం లేదు - ఏ లైట్ బాయ్‌గానో, ట్రాలీ మెన్‌గానో అయినా సరే, అదీ ఎవరూ ఇవ్వకపోతే, ఏ సినిమా హాలు దగ్గరో గేటు కీపర్‌గానో, అదీ దొరక్కపోతే పల్లీలు అమ్ముకునో, ఆఖరికి స్టూడియోల ముందో, సినిమా హాళ్ళ ముందో బిచ్చం ఎత్తి అయినా పొట్ట నింపుకోవాలన్న స్థితికి వచ్చేడు.

అప్పుడు తగిలేడు చంద్రశేఖరన్.

అతడు మలయాళీ. కానీ మద్రాసులో స్థిరపడ్డాడు. ఆంధ్రా నుంచీ కేరళ నుంచీ వచ్చిపోయే కొబ్బరికాయల వ్యాపారంలో బాగా గడించాడు. అనుకున్న దానికన్నా ఎక్కువ లాభాలు వచ్చిన యేడు, అదనపు లాభాల్ని - తనకి నమ్మకమైన వారి ద్వారా సినిమా వాళ్ళకి వడ్డీకి ఇస్తుంటాడు.

అతను బూతుల డైరెక్టరుగారు చేసిన రెండు మూడు సినిమాలకు అప్పిచ్చాడు. ఎప్పుడయినా పని లేనప్పుడు ఆ ప్రొడ్యూసర్లతో సెట్స్‌కి వస్తుండేవాడు. ఓ పక్కన కూర్చుని చూస్తుండేవాడు. ఎప్పుడయినా - సెట్స్ మీద తీరిక లేకుండా తిరిగే శంకర్‌ని పిలిచి ఏవో ఒకటి రెండు ప్రశ్నలు వేసేవాడు.


ఎంత పని వున్నా తన అలవాటు ప్రకారం ఓపిగ్గా వినయంగా జవాబు చెప్పివెళ్ళేవాడు శంకర్. వేళ ప్రకారం మర్యాదలూ చేసేవాడు.

* * *

"అయ్యగారు నిన్ను ఒకసారి కలవమన్నారు" అని చెపితే ఎందుకో అనుకున్నాడు. ముందు వెళ్ళలేదు. బస్సు ఛార్జీలకు కూడా డబ్బు లేకపోవడం రెండో కారణం.

మళ్ళీ వారం పది రోజుల తర్వాత నౌకరు వచ్చి "వెంట బెట్టుకు రమ్మన్నారు" అని - బస్సు ఖర్చు కూడా పెట్టుకుని తీసుకు వెళ్ళాడు.

బిస్కెట్లు కాఫీ అయ్యాక చంద్రశేఖర్ అడిగాడు "శంకర్! ఏమేమి సినిమాలు చేస్తున్నావు?" అని. శంకర్‌కి మలయాళం వచ్చు, సంభాషణ అంతా మలయాళంలోనే సాగింది. ఏమీ లేదు అంటే బేవార్సు అనుకుంటాడని "ఏదో సార్! అంత గొప్పని కాదు. అని గూడా ఫైనాన్స్ ప్రోబ్లమ్స్ వల్ల సరిగా సాగ లేదు" చిన్న అబద్ధం చెప్పాడు.



కాసేపు చంద్ర శేఖరన్ ఏమీ మాట్లాడలేదు. నెమ్మదిగా నిలబడి "ఇక్కడ వద్దు పైన మాట్లాడుకుందాం" అని మేడ మీదకి తీసుకు వెళ్ళాడు. శంకర్‌కి విస్మయంగా వుంది.

"శంకర్! నిన్ను చాలా సార్లు చూసినా, మీ ఆంధ్రా వాళ్ళు సిన్సియర్. నాకొక్క మాట - నిజం చెప్పు. సినిమా బిజినెస్ ఎట్లా వుంది?"

ఎవడికో అప్పు ఇవ్వడానికని అడుగుతున్నాడు కాబోలనుకొని "జాగ్రత్తగా చేసుకోవాలి సార్! దండిగా డబ్బు పెట్టే దానికన్నా చిన్న బడ్జెట్ చిత్రాలయితే, ఫర్వాలేదు సార్!"

అతడు తల వూపేడు. ఆ భావం ఏమిటో అర్థం కాలేదు. అయిదారు నిముషాల నిశ్శబ్దం తర్వాత అటు ఇటు చూసి "ఇది ఎవ్వరితోటి అనమాకు. మా

ఇంట్లో వాండ్లకి ఎవ్వరికీ ఇష్టం లేదు. ప్రామిస్!" అన్నాడు.

అంత రహస్యం తనతోనే ఎందుకు చెపుతున్నాడబ్బా అని శంకర్ అబ్బుర పడ్డాడు!! ప్రామిస్ సార్!"

"నేనొక సినిమా తియ్యాలనుకుంటున్నా"

# సూపర్ హిట్

పసుపులేటి మల్లికార్జునరావు



ఒక్కసారే మూడు సినిమాలకైనా డబ్బివ్వగలవాడు. ఇందులో వింత ఏమీ లేదు. ఏ హీరో, హీరోయిన్, ఏ డైరెక్టర్, కెమెరా ఎవరు లాంటి సలహా అడుగుతుండ వచ్చు ననుకొని "చెప్తాను గదసార్, చిన్న చిత్రాలయితే ఫర్వాలేదు అని" అన్నాడు.

"అది సరే సామీ! నేనడిగేది అది కాదు. నువ్వే సినిమాని డైరెక్ట్ చెయ్యి!"

శంకర్‌కి నమ్మకం కలగలేదు. ఇలా చాలా మంది అంటూ వుంటారు. తనూ ఇటువంటి మాటలు విన్నాడు. అవన్నీ - రాత్రి ఎనిమిదీ తొమ్మిది తర్వాత మందు తలకెక్కిన మాటలు.

కాని ఇది మిట్ట మధ్యాహ్నం చంద్ర శేఖరన్ తాగలేదు.

"చెప్పినా గదా! మీ ఆంధ్రా వాళ్ళు సిన్సియర్ అని. అందుకే నీతో పని చేయించుకుందామని అనుకుం టున్నా."

శంకర్‌కి సంతోషమైంది. "మంచిది సార్!" అన్నాడు. "అయితే లాభం జాస్తిగా రానక్కర్లేదు."

"అలాగే!"

"ఎప్పటి నుండో సినిమా తియ్య సలెనని నా కోరిక. వడ్డీకిస్తే ఎంతో కొంత వస్తుంది. సినిమా తీస్తే అంతా పోతుందని భయం. అయినా ఇప్పుడు భయ ంలేదు. రెండేళ్ళుగా నా బిజినెస్ బాగుంది."

సరి - అనుకున్నాడు శంకర్.

"కథ కూడా నా దగ్గర రెడీగా వుంది" మరో అస్త్రం వొదిలాడు.

ఇదంతా మామూలే. పన్నెండేళ్ళ నుంచీ ఇటువంటి కబుర్లెన్నో విన్నాడు.

"చెప్పండి" అన్నాడు.

కథ చెప్పాడు. ఒక-భర్త పోయినావిడ, ఒక-భర్త బతికున్నావిడా వుంటారు. వాళ్ళు ఎదురెదురు ఇంటి వాళ్ళు. స్నేహితులు. కాలక్షేపానికి వాళ్ళు భర్త పోయినావిడ ఇంట్లో చేరి కబుర్లాడుకుంటుంటారు. భర్త ఉన్నావిడ తన మొగుడు తనని ఏమేం చేస్తాడో చెపుతూ వుంటుంది. వితంతువు - పాపం తన మొగుడూ తనని ఏమేం చేసేవాడో తలుచుకుంటూ వుంటుంది. చిత్రం! ఆవిడ వూహాల్లోకి ఆ మొగుడు

# దూర తీరాల నుండి...!

చిన్నా...
నువ్వు వస్తావన్న కబురందుతుందో లేదో
గుమ్మం ముందే చూపుల ప్రవాహాలు ఘనీభవిస్తాయి
నీ గురించి ప్రతి చిన్ని విషయం గుండెల్లో రెక్కలు
విప్పుకుంటుంది
నీ మాట, పాట, పలుకు, పదం
ఆప్యాయంగా స్పర్శిస్తూ ఉక్కిరిబిక్కిరి చేస్తాయి

చిన్ని కృష్ణుడిలా వెన్న దొంగిలించటాన్ని
అల్లరల్లరయి కొంగుచాటున అలిపించటాన్ని
ఆకాశంలో ఎగరేసిన గాలిపటం కొస తెగినపుడు
కన్నీళ్లవటాన్ని
మళ్లీ 'అమ్మా' అన్న నీ పిలుపులో చూడాలని ఎంత ఆశ...

చిన్నక్క ఎప్పుడూ నీ గురించే తలుచుకుంటుంది
క్లాసులో ఫస్ట్ రేంక్ రానందుకు కొట్టిందట కదా...

వచ్చి రాగానే అక్కా అంటూ చుట్టుకుంటావో లేదోనని
భయం

తను అయితే ఇంక చెప్పే పనే లేదు
అనుక్షణం నీ నామస్మరణే
నలుగురు కలిసిన వేళ నువ్వే ఒక్కొక్కరివి అవుతావు

పాలు-వెన్నెల
ఇలా విచ్చుకుంటే అచ్చు నీ మనః సరోవరంలాగే వుంది
ఆ గాలి ఆగి...ఆగి... వీస్తూవుంటే
నువ్వు చిన్నగా నవ్వుతున్నట్లే వుంది

సమయమెంతకీ కదలదేం?
ఇంతకీ రోజుకి ఇరవై నాలుగ్గంటలేనా కాదా?

గాలి అలల్లో లీలగా కనురెప్పలు వాలాయో లేదో,
నెత్తుటి ముద్దై గుమ్మం ముందు తారాడుతున్నావు
నీ శరీరం నుంచి తుపాకీ కొస పూచిన ఖాకీ పువ్వు వాసన

—వంశీకృష్ణ

సరిగా రాదు. కండలు తిరిగిన కమ్మరి కొలిమి వాడూ, గడ్డం పెంచుకున్న ఆటో డ్రైవరూ, పక్కింటి సదావో రేళ్ళ కాలేజి కుర్రాడూ - ఇలా ఎవరెవరో వచ్చి ఏదేదో చేసి పోతుంటారు...... చంద్రశేఖరన్ అంత సచ్చిగా ఆలోచిస్తాడని శంకర్ ఊహించ లేదు.

"బాగుంది సార్. తప్పకుండా చేద్దాం" అన్నాడు ఏడవ లేక నవ్వుతూ.

మరో గంటకి ఇంకాసిని బిస్కట్లూ, కాఫీతో సమావేశం ముగిసింది.

యథా ప్రకారం బస్సు ఛార్జీలకు లేక, అడగలేక - కాళ్ళీడుస్తూ రెండు మైళ్ళు లెఫ్ట్ రైట్ కొట్టాడు.

కానయితే శంకర్ వూహించినట్టు అదంతటితో ఐపోలేదు. వారం తర్వాత ఈసారి చంద్రశేఖరన్ అతని కోసం ఆటో పంపించాడు.

అతనక్కడికి వెళ్ళే సరికి చంద్రశేఖరన్ ముందున్న టేబిల్ మీద ఒక చిన్న కాయితాల బొత్తి వుంది. దాని పక్కనే కొత్తగా ఓపెన్ చేసిన కరెంట్ ఎకౌంట్ పాస్ బుక్ వుంది. ఆ కాయితాల బొత్తి చంద్రశేఖరన్ రాసిన కథ. ఆ పాస్ బుక్‌లో సిన్నవే ఐదులక్షలు డిపాజిట్ వేయబడి వుంది.

అప్పటికి గానీ శంకర్‌కి నమ్మకం కలుగలేదు.

తెలుగు అనుకుంటే మలయాళం వచ్చింది. అయితే వచ్చిన అవకాశం జారవిడుచుకునే ప్రసక్తి లేదు. మొదటిసారి తనని దర్శకునిగా బ్రాండ్ వెయ్యబోతున్న చిత్రం అది.

చంద్రశేఖరన్ తరచూ ఉపయోగించే 'సిన్సియర్' అనే మాటకు న్యాయం చెయ్యటానికి శాయ శక్తులా న్యాయం చేకూర్చేడు.

ఎంత సెక్స్ చిత్రాలకు పేరుపడ్డా, ఈసారెందుకో మలయాళీ ప్రేక్షకులు ఈ మానసిక వ్యభిచారాన్ని ఘోరంగా తిప్పి కొట్టేరు. బొమ్మ జీరుస చీదేసింది. ఎంతగానంటే - మళ్ళీ ఆటల్ని ప్రదర్శిస్తే సినిమా హాలు యజమానులు థియేటర్ బిల్డింగ్‌కు నిప్పెదులుకోవాల్సి వస్తుందని వార్నింగ్ ఇచ్చారు.

క్లైసయినా ఎక్కడో చోట ఆడి, ఎంతో కొంత వస్తుందని ఆశించిన నిర్మాత గారికి, జనం డబ్బాల్తో సహా చితకబాదేశారని విని గుండె ఠమ్మని పేలిపోయింది.

"నన్నా శాశ్వతంగా బొంద పెట్టేసేరు," అని తల బాదుకున్నాడు శంకర్. కానయితే ఆ బొందలోనే అతని మరో సినిమాకి పునాది రాయి పడుతుందన్న విషయం అతనికి ఊహాతీతం.

* * *

చంద్రశేఖరన్‌తో కొబ్బరి కాయల వ్యాపారంలో లావాదేవీలు వున్న కోనసీమ సుబ్బారాయుడుగారు, తన మిత్రుని మరణవార్త విని అఘమేఘాలమీద మద్రాసులో దిగేరు. దశ దినకర్మల దాకా వుండి అవి ముగిసేక జరిగిందేదో తెలుసుకుని ఆ చిత్ర దర్శకుడిని వెతికి పట్టుకునే కార్యక్రమంలో పడ్డాడు. ఈలోగా ఫిలిం డబ్బాలన్నీ ఎక్కడెక్కడ వున్న సన్నీ సొంత ఖర్చుతో నాసను తెప్పించేరు. తనకు తెలిసిన వాళ్ళ ద్వారా ఒక ప్రివ్యూ థియేటరు అద్దెకు తీసుకొని సినిమా వేయించి చూసేడు. సగం చూసే సరికి కిర్రెక్కి పోవలసిన మనిషికి చిర్రెత్తుకొచ్చింది.

పొద్దున లేవగానే ఒక వ్యాను అద్దెకు తీసుకొని డబ్బాలన్నీ దాని కెక్కించాడు. నేరుగా శంకర్ ఇంటికి వచ్చేడు. అతన్ని దాన్లో ఎక్కించుకున్నాడు.

"ఇంతా చేస్తే నువ్వు తెలుగు వాడివే"

"అవును సార్!" శంకర్‌కి అతనెవరో, ఇలా ఎక్కడికి పోతున్నారో బోధపడట ంలేదు. వాను మహాబలిపురం రోడ్డు ఎక్కింది. ఇళ్ళని వెనకబట్టిపోయి నిర్జనంగా వున్న చోట వాను ఆపించేడు. ఇసుకా సరుగుడు చెట్లూ - ఆ వెనక సముద్రం.

"దిగు"! అని తనూ దిగి డ్రైవర్‌ని కూడా దిగమని వెనక వున్న ఫిలిం బాక్సులన్నీ కింద పడేయమన్నాడు. అదయ్యాక "డ్రైవర్! నీ బండి టాంకులో నాలుగైదు లీటర్లు డీజెల్ బయటికి తియ్యగలవా?" అన్నాడు.

"ఎన్నా సార్?"

"ఆ అయిదు లీటర్లు ఖరీదు నేనిస్తా" అని ఒక యాభయి రూపాయిల నోటు ఇచ్చి "నువు మళ్ళీ డీజిల్ వచ్చిన చోటికి చేరడానికి సరిపోతుందా" అన్నాడు.

"ఆఁసార్"

"సీ పని కానీ" అన్నాడు.

డ్రైవర్ ఎప్పుడూ తన దగ్గర వుండే ప్లాస్టిక్ పైపుతో ఖాళీ టిన్నులోకి డీజిల్ నోటితో లాగేడు. అదయ్యాక "ఆ డబ్బాల మీద గుమ్మరించు" అన్నాడు రాయుడు.

శంకర్ నిర్ఘాంతపోయి చూస్తున్నాడు.

రాయుడు జేబులోంచి అగ్గిపెట్టె తీసేడు. దాన్ని వెలిగించి "నువ్వంటే స్త్రీవా? నన్ను అంటించమంటావా?" అన్నాడు సీరియస్‌గా.

"సార్...... సార్..."

అగ్గిపుల్ల దాని మీదకి విసిరేడు. భగ్గుమంది. అప్పు డందుకున్నాడు రాయుడు. "నోరు ముయ్యరా పైత్యకాలి నా కొడకా! అసలు నిన్ను గూడా ఆ మంటల్లో వేసి తగలెయ్యాలి అన్నదు గాని బుద్ధి రాదు!"

శంకర్ తల వొంచుకున్నాడు.

"ఇట్టాంటి యదవ బొమ్మల్తీసి దేశం మీదకి వదిల్తే చూసిన ఆడ కూతుళ్ళు తిన్నగుంటార్రా? వచ్చినోడికి కొన్నెక్కి ఏదో చెయ్యమన్నాడే అనుకో, నీ బుద్ధి ఏ గుంటల్లో పుచ్చిపోయిందిరా? అరేయ్ నీకు పెళ్ళయిం దిరా?"

"కాలేదు"

"అయితే నీ అక్కనో, అమ్మనో, నాన్ననో తీస్కు పోయి ఈ సినిమా చూపించు ఎదవాని ఎదవా?" అరగంట సేపు తిట్టిన తిట్టు తిట్టకుండా తిట్టేడు. మళ్లీ వాను ఎక్కించి మౌంట్ రోడ్డులో దింపాడు.

"అరేయ్! తెలుగోడి పేరు చెడగొట్టకు" అని ఒక పది రూపాయల కట్ట చేతిలో పెట్టి, "ఇట్లాంటి చిత్రకార్తె సినిమాల్తీసి జనాన్ని చెడగొట్టకు; నీకేదన్నా చాన్సు మంచిది వచ్చేటట్లుంటే నాకు చెప్పు. ఏదన్నా సాయం చేస్తా" అని వెళ్ళిపోయాడు.

జేబులో వెయ్యి రూపాయిలున్నా ఏమంత ఉత్సాహంగాలేదు. వారం పది రోజుల పాటు మర్చిపోదామన్నా మరువలేని సంఘటన. అయితే- ఇదెవరు చూశారో ఎట్లా వ్యాపించిందో గాని - ఇండ స్ట్రీలో పెద్ద జోకయి పోయింది.

ఆ జోక్ అతనికి జీవం పోసింది.

* * *

"ఈ మధ్య మీ గురించిన చర్చ విన్నాను. ఫీల్డులో అందరూ అదొక జోక్‌గా చెప్పి నవ్వు కుంటున్నారు. నేను మాత్రం - సీరియస్‌గా ఆలోచించాను. అందుకే మిమ్మల్ని కలిసేను" అన్నదామె. బీచ్‌లో జనానికి దూరంగా కూర్చొని వున్నారు వాళ్లిద్దరూ.

ఆమె తనని తాను 'రాణి'గా పరిచయం చేసు కుంది. పేరు గుర్తులేదు కానీ ఆమెను అదివరకు నాలుగైదు సార్లు చూసేడతను. సినిమాల్లో చిన్న చిన్న వేషాలు - ఆడే హీరోయిన్ స్నేహితురాలిగా, డాక్టరుగా, లాయర్‌గా ఇలా-మరీ గుంపులో కాకిలా కాకుండా - కాసిని డైలాగులుండే పాత్రలు చేస్తుంటుంది.

"చెప్పండి!" అన్నాడు శంకర్.

"నేను చాలా ఆలోచించి ఒక నిర్ణయానికి వచ్చాను."

శంకర్ మాట్లాడలేదు.

"నేను మీకొక మంచి వార్త చెప్తాను."

"థాంక్యూ"

"మళ్లీ మీరొక సినిమాకు దర్శకత్వం వహించాలి!"

"ఆహా!" నవ్వేడు - అది వ్యంగ్యమో ఆశ్చ ర్యమో తెలియకుండా."ఇండస్ట్రీలో వుండి ఎన్ని లంపటా లుంటాయో తెలిసే ఆ మాట అన్నారా?"

"అవును"

# నీవే నాకు లేని క్షణం

నాకు సంబంధించిన కొన్ని విలువయిన వస్తువులు నీవద్దనే వుండిపోయాయి
అవెప్పటికైనా నాకు చేరవలసిందే-కాబట్టి వెంటనే పంపించివెయ్యి
నీకు గుర్తుందో లేదో, ఆ అందమైన సాయంత్రం!
వాన కురుస్తున్నా సంజె రంగులింకా వెలిసిపోలేదు-
వానలో తడవకుండా ఇద్దరం ఒకే గొడుగుకింద నిలబడ్డాం!
ఇంకా రాని బస్సు కోసం ఎదురు చూస్తున్నాం!
రంగు రంగుల ఆ గొడుగు క్రింద ఎన్ని ఘడియలు దొర్లిపోయాయో!
ఆ తీపి ఘడియల్లో సగం ఘడియలు నావి
నా సగం నాకు తిప్పి పంపించు

మరొకనాడు పచ్చని మైదానంలో చేయీచేయీ కలుపుకుని నడుస్తున్నాం
సూర్యోదయం కాకపోయినా మసక వెలుతురొచ్చేసింది
ఆ వెలుగులో పొగమంచు మన చుట్టూ గిరికీలు కొట్టి ఏడిపిస్తోంది
చిరుగరికపై నిలిచిన హిమబిందువులు మనల్ని చూసి నవ్వాయి
నువ్వు వాటిని నీ చెవి జూకాలలో ముత్యాలుగా పొదగమన్నావు
ఆ ముత్యాలతోపాటు నా మనసుకూడా అక్కడే పొదిగేశాను
అవింకా నీ చెవులకే చంచలంగా ఊగుతూ వుండి వుండాలి
దాన్ని విడిపించి వెంటనే పంపిస్తావు కదూ!

గడిచిపోతూన్న ప్రతి రేయీ నీ వద్దనే ఆగిపోతున్నది
నన్ను నిద్దురకు దూరం చేసి కలవర పరుస్తున్నది
నీవే నాకు లేని క్షణం ఇంక అవన్నీ నీవద్ద ఎందుకు?
నీ దగ్గరే ఆగివున్న రేయిలన్నింటినీ వెలిగించు
ఆ వెలుగులో నా సామానులన్నీ నాకు సర్ది పంపించు

— పుట్టగుంట గోపీచంద్

"ఏమిటంత ధీమా?"

"నా శరీరం మీద నాకా నమ్మకం వుంది"

"వ్వాట్?"

"నోవరాక్షనొద్దు. మన సినిమా జనం పైకి రావడానికి ఏమేం సాధనాలు వాడతారో మీకు తెలుసు. నిన్న మొన్నటి దాకా నేనూ కొంత మడి కట్టుకుని చిన్న చిన్న వేషాల్లోనే వుండిపోయేను. మీ ఫిలిం బాక్సుల సంఘటనకు ఓరోజు ముందో, వెనకో - ఒక డాక్టరుగారు నాకు జ్ఞానోదయం కలిగించారు - జీవితం చాలా చిన్నది, చెయ్యవలసిందేదో చక చకా చేసెయ్యి, దీపముండగానే ఇల్లు చక్కబెట్టుకోమని."

"బావుంది! ఇంకా?"

"మనం సైడ్ ట్రాక్‌లో పడ్డట్లున్నాం."

"అదంతా సరే! మొన్నటి దెబ్బతో, నా సంగతి తెలిసీ భరోసాతో డబ్బు పెట్టే వెర్రికుట్టె ఎవడూ వుండడు."

"అదంతా నాకొదిలెయ్యండి. నాకో నాటు కోటి సెట్టిగారు మొన్నటి మీ కోనసీమ సుబ్బారాయుడు గారూ తెలుసు. ఇంకా నలుగురైదుగురున్నారు అటు వంటి వాళ్ళు."

"తెలిసినంత మాత్రాన..."

"డబ్బివ్వరు. మన పరిభాషలో 'తెలియడం' అంటే మీరెరుగరా?! అయినా ఇందాకే చెప్పానుకదా, నా ఒంటిమీద నాకా నమ్మకం వుందని."

"సారీ-నా వుద్దేశ్యం అదికాదు."

"చాలా రోజులుగా సెట్స్ మీద మిమ్మల్ని గమనిస్తూనే వున్నాను. అవకాశం వస్తే మీరు మంచి డైరెక్టరవగలరని ఎప్పుడో అనుకున్నాను. అవకాశం వచ్చినా - అదృష్టం ఎదురు తిప్పిందని చూసి - ఈ సారి ఈ అదృష్టాన్ని గూడా జుట్టుపట్టి లాక్కు వచ్చి మీ ముందు నించోబెట్టాలని నిశ్చయించుకున్నాను."

"ఎలా?"

"అదంతా తర్వాత! ముందు కథ సిద్ధం చెయ్యండి"

"అలాగే!"

"నెల రోజుల్లో స్క్రిప్ట్ సిద్ధం చెయ్యాలి. కథ పాతదే - నేను చెప్పిన మీ నీలి చిత్రం. అయితే ఆ బ్లూ ఫిలిం సీన్లు వద్దు. భర్త చనిపోయిన ఒక స్త్రీ-పిల్లలుంటే వాళ్ల ఆలనా పాలనా, ఆమెకో ఉద్యోగం, అది చూసి వితంతు వివాహం చేసుకుని ఆమెని ఉద్ధరించిన వాడు - మాట మాటకి 'నీ మొదటి మొగుడు,' అంటూ మాటలతో హింసించడం, ఆమె సంపాదనతోనే జల్సాగా తిరగడం, వేరే ఆడ వాళ్లతో సంబంధం పెట్టుకోవడం, ఆమెనేమో వాడితో వీడితో కులుకుతూ మాట్లాడావని అనుమానించడం, చివరికి - ఆమె చనిపోతే ఆ ఉద్యోగం తనకి వస్తుందని ఎవరో చెబితే అంతం చెయ్యడానికి ఉంపుడుగత్తెతో కలిసి ప్లానెయ్యడం, అది తెలిసి విరక్తితో ఆమె ఆత్మహత్య చేసుకోవడం..."

శంకర్ రెప్పవాల్చకుండా ఆమె చెప్పేది వింటు న్నాడు.

"తెల్సుగా - సినిమాల్లో ఆడవాళ్లని ఏడిస్తే డబ్బులెలా వస్తాయో?"

అతనొక తిరుగులేని నిర్ణయానికి వచ్చినట్టు అన్నాడు "ఇంక చెప్పాల్సిన పని లేదు. ప్రేక్షకులు ఎప్పుడే సబ్జక్టుని ఆదరిస్తారో, తిరగ్గొడతారో సినిమాని కనిపెట్టినవాడు కూడా చెప్పలేడు. అయినా సరే, దీన్ని ఎవడు సినిమా తీసినా, తియ్యకపోయినా ఫర్వాలేదు. మేను మాత్రం కథ, స్క్రీన్ ప్లే తయారుచేసి వుంచుతాను!"

"ఒక నెలలోపు! నేనూ అప్పటికి నా వాగ్దానాన్ని నిలుపుకుంటాను. మరొక షరతు. మీ అదృష్టాన్ని జుట్టు పట్టి ఈడ్చుకుని నిల్చోబెట్టాలంటే ఈ సినిమాలో నేనే హీరోయిన్ని."

"వెల్‌కం! ఒక సబ్జక్టుని ఎంత చెడ్డగా చూసినా, ఎంత మంచిగా చెప్పినా సజెస్ట్ చేసి, పాత్రల స్వభావాన్ని క్లుప్తంగా చెప్పగలిగిన మీ కన్నా మరొకరు బాగా చేస్తారని అనుకోను. ఒకవేళ మీరు చెయ్యకపోయినా అది మీ వద్ద మంచి రాబట్టగలను. నా మెదడు మీద నాకు నమ్మకం వుంది."

ఇద్దరూ నవ్వుకున్నారు.


శంకర్‌కి ఎంతో ఉత్సాహంగా వుందిప్పుడు. బీచ్ నుంచి తిరిగివస్తూ సుబ్బారాయుడు ఇచ్చిన వెయ్యిలో మిగిలిన అయిదారొందలున్న ధైర్యంతో "ఏదయినా హోటల్లో డిన్నర్ తీసుకుందాం" అన్నాడు. ఆమె టక్కున "డిన్నరా" అనడిగింది.

శంకర్ నాలిక్కరుచుకున్నాడు. ఇట్లా డిన్నర్‌కి రమ్మనడంలో అంతరార్థాలు వేరే. "సారీ! వెరీ సారీ!! నా ఉద్దేశ్యం అదికాదు!"

"భుజాలు తడుముకోకండి. మన సినిమా పరిభాష అటువంటిది. అన్నట్టు పాండీ బజార్లో ఆంధ్రా వాళ్లు కొత్తగా హోటలొకటి పెట్టారు. అక్కడ గోంగూర, కొరివికారం, ఊరగాయల వంటివి స్పెషల్. వెళ్దాం పదండి"

* * *

రాణి తన మాటను నిలబెట్టుకునేందుకు ఆరు




వారాలు పట్టింది.

ఇన్నాళ్ల నిత్యావసరాలకి అవసరమయ్యే డబ్బు కోసం, ఆసరా కోసం సెట్టిగారిని ఆశ్రయించింది. ఇప్పుడా గిరీ, గీతల్ని ఒక్క తన్ను తన్నేసి నెలపాటు సెట్టిగార్ని స్వర్గాల్లోకి లాక్కుపోయింది. ఎట్టకేలకు ఆయన నోప్పేరు - అదీ కొంత మేరకే! టాక్సు సమస్యల వల్ల తన తమ్ముడినీ, తమ్ముడు బావమరిదినీ నిలబెట్టాడు.

ఇంకా మిగిలిన దానికోసం - నాల్రోజులు మద్రాసులో మాయమై అమలాపురంలో సుబ్బారాయుడి గార్ని కలిసింది. ఆయన్ని వైజాగ్ తీసుకొచ్చింది. తమిళ సముద్ర తీరంలో సెట్టిగార్ని ఎలా ముంచి తేల్చిందో, తెలుగు సముద్రపు ఒడ్డున సుబ్బారాయుడి గార్ని అలా ముంచి తేల్చింది.

ఆయన మద్రాసులో వున్న ఫైనాన్సర్ గారికి ఫోను చేసి "మానా! ఎంత డబ్బు కావాలన్నా ఇచ్చెయ్యి. అది పెట్టుబడి, సగం నేనిస్తాను. లాభం చెరి సగం. ప్రశ్న లెయ్యమాక" చెప్పాడు.

తాను డబ్బాలు తగలేసిన ఫిలిం డైరెక్టర్ దీనికి డైరెక్టరని విని బొళబొళ నవ్వి "సోమకోలు నా కొడుకు! తినే బొనికలు మెళ్లో వేసుకోకుండా వాళ్ల దగ్గర పెట్టు కుని పని చెయ్యమని చెప్పు." అని రాణి భుజం తట్టి చెప్పాడు.

ఈలోగా శంకర్ స్క్రిప్ట్ తయారుచేశాడు. స్క్రీన్ ప్లే రాసాడు. మళ్లీ మళ్లీ షాట్ వైజ్, ప్లాట్ వైజ్ రాసుకుంటూ పోయాడు. రాణి వచ్చి చెప్పేదాకా అతను పని మళ్లీ మళ్లీ చేస్తూనే వున్నాడు. ఆమె వచ్చి "నీ ప్రయత్నం ఏమైంది?" అన్న ప్రశ్నకు "ఇది చదివిచెప్పు" అని కాగితాలు అందించాడు.

మాట్లాడుతూనే వాటిని అలవోకగా చదివింది. ఇటువంటివి కొన్ని వందల సినిమాలు వచ్చేయి. అయినా సమాజం వున్నంత కాలం సమస్యలు పునరావృతం అవుతూనే వుంటాయి. అలాగే సినిమాలు కూడా. "నైరాశ్యం! మరీ సీరియస్‌నెస్ భరించ లేరు. వ్యవస్థ మీద ఈ చెల్లాంటి మాటలు విసర దానికి హాస్యపాత్ర నొకదాన్ని ప్రవేశపెట్టండి!" అంది కాగితాలు పక్కన పడేసి.

శంకర్ బుర్రమీద కొట్టుకున్నాడు. "కరెక్ట్ మీరు చెప్పింది!"

"ఆ పాత్ర కుంటిదో, పొట్టకన్నదో - అయి వుండాలి. అది మీరు వేస్తారు."

"ఆ... ఆ..." డంగైపోయాడు శంకర్.

"పోతే మీరు గుర్తుంచుకోవలసింది - మనకి డబ్బిచ్చేవాళ్లు ఫక్తు సినీ వ్యాపారులు కాదు. టాక్సులు ఎగ్గొట్టి, ఆస్తులూ అప్పచ్చులూ కొనగా - మిగిలిన దొంగ డబ్బే! అది కూడా వాళ్లు నా ద్వారా పొందిన ఆనందానికి సరిపడే విలువే ఇస్తారు. రెండ్రోజుల్లో ఫిగర్ చెప్తాను. పొదుపుగా ప్లాన్ చెయ్యండి."

"రైట్!"

"మద్రాసు లాంటి నగరాల్లో ఒకర్నొకరు పట్టించుకోరు గనక ఆ వైపు సమస్యలుండవు. మన కథకు ఏదో ఒక తాలూకా కేంద్రం - స్థాయి, ఊరుని ఎన్నుకుందాం. కాబట్టి ఇక్కడి సినీజనం మనల్ని సిందుకు తినేస్తారన్న భయం వుండదు. సినిమా వాళ్లు తనింట్లో వున్నారన్న గొప్పకోసం ఎవరో ఒకడు మనల్ని భరిస్తాడు"

"నిజంగా మీరు జీనియస్!"

"కబుర్లమాటలు తర్వాత. ఒకే షెడ్యూలు. అంతా కలిసి ఏడెనిమిది మంది. ఒక మోస్తరు గుర్తింపు వున్న ఆర్టిస్టులం. పదిహేను రోజుల్లో లాగించాలి. మరో నెలలో డబ్బింగు, రికార్డింగ్, లాబ్ వర్క్ అయిపోయి విడుదలకి సిద్ధపడాలి. మనకున్న టైము చాలా కొద్ది."

"మంచిది! మరి ఎప్పుడు ప్రారంభిద్దాం?"


"రేపు. మహాయితే ఎల్లుండి."

"నాకేం అభ్యంతరం లేదు"

"వస్తాను" నిల్చుందామె.

"కొంచెం సేపు కూర్చోండి... కొరివికారం గోంగూర హోటల్ కెళ్దాం."

"లేదు! కొంచెం పనుంది. అయిదున్నరకి ఒకర్ని కలుసుకోవాలి."




వెళ్ళిపోయిందామె. ఆమెని చూస్తూ అనుకున్నా డతను. "నువ్వు నా కోసం తెచ్చే అదృష్టం ఏమీ లేదు. ఎందుకంటే ఆ అదృష్టం ఇదివరకే నీ రూపంలో నన్ను వెదుక్కుంటూ వచ్చింది." అతను గమనించాడో లేదో గాని - ఆమె సాన్నిధ్యం అతని మనసు అహరహమూ కోరుతోంది.

* * *

పార్ట్‌నర్ కూడా అయిన ప్రొడ్యూసర్ బొమ్మిరెడ్డికీ, మైకా గనుల గోపిరెడ్డికీ మంచి స్నేహం. యూనిట్టంతా గూడూరు వచ్చారు. రాణి అన్నట్టుగానే - గోపిరెడ్డి సినిమా వాళ్ళు తన దగ్గరికి వచ్చారని అన్నీ ఏర్పాట్లు చేశాడు.

టెక్నీషియన్సు గూడా - నీలైనంత వరకూ కొత్త వాళ్ళు - ముఖ్యంగా ఫిలిం ఇన్‌స్టిట్యూట్‌లో మంచి వచ్చిన వాళ్ళు. అందరూ నాళ్ళొంచి పనిచేశారు.

రాణి మంచి ఈజ్ వున్న నటి. చాలా సీదా సాదాగా వుండే ఆమె ముఖంలో పలకని భావం లేదు. ఒక మూడ్ నించి మరో మూడ్‌కి రావటానికి ఆర్టిస్టులు కొంత సమయం తీసుకుంటారు. కాని ఆమె గుండెలని పిండేసేలా ఏడ్చే భావన నుంచి, పొట్టచెక్కలయ్యేలా నవ్వే భావంలోకి మారిపోవటానికి సెకన్లో వందో వంతు కూడా పట్టదు. అలాగే ఇతర భావాలూ!

అయితే ఉన్నట్టుండి స్పృహ తప్పిపోయేది. తేరు కున్నాక నవ్వి "బాగా నటించాలన్న ఆవేశం ఎక్కువై పోయింది" అంటూ వుండేది. అప్పుడు ఏవో టాబ్లెట్లు మింగేది. అవేమిటని ఎవరైనా అడిగినా, తన బాగ్ ఎవరైనా ముట్టుకున్నా విపరీతమైన కోపం. రాత్రిళ్ళు నిద్రమాత్రలు తప్పనిసరి!

మొత్తం మీద షూటింగ్ అనుకున్న దానికన్నా బాగా జరిగింది. ప్యాక్ చేసి మద్రాసు తిరిగివస్తూంటే శంకర్‌తో అంది "మన సినిమా బాగా పోతుంది. ఎందుకో తెలుసా? షూటింగ్‌లో స్పృహ తప్పిపోవటం, టాబ్లెట్లు మింగటం కూడా నటనే. అవొట్టి తంచదార బిళ్ళలు. అందుకే వాటిని గురించి అడిగితే అంత కోపం నాకు. ఇవన్నీ సినిమా విలేకరులు చిలవలు పలవలుగా రాస్తారు. అదే మనకి గొప్ప పబ్లిసిటీ."

శంకర్ ఆమె ముఖంలోకి పరిశీలనగా చూశాడు. నవ్వే! కాకపోతే కళ్ళలో ముఖంలో బాగా అలసట. మాటలనీ, ముఖ కవళికలనీ బట్టి - బ్రహ్మ కూడా ఆమె మనసులో భావం ఏమిటో చదివినా చెప్పలేడు. ఆమె మాటలు నమ్మబుద్ధి కాలేదు.

మద్రాసు సమీపిస్తుండగా "ఒకటి రెండ్రోజులు బాగా రెస్టు తీసుకుని మిగతా పని పూర్తి చేద్దాం. అన్నట్టు మర్చిపోయాను - ఇది వరకు మీరోసారి అడిగారు గుర్తుందా - డిన్నర్ తీసుకుందామని... ..."

శంకర్ తుళ్ళిపడ్డాడు. రెండు చేతులెత్తి "క్షమించు! నిజంగానే నాకా రోజు అంత సాహసపుటాలోచన లేదు" అన్నాడు. అదీ ఏకవచనంలో!

ఎడం చేత్తో అతని రెండు చేతుల్నీ పక్కకి నెట్టేసి - "ఎప్పుడూ అదే ధ్యాస కదా!" అంది నవ్వుతూ. "నిజంగా మన సినిమా హిట్టే. మొదటి రెండు మూడు రోజులు ఏవరేజ్‌గా పోయినా తర్వాత మాత్రం జనం టిక్కెట్ల కోసం తన్నుకుంటారు. అప్పుడు - అంటే ఏ రెండో వారం మధ్యలోనో సుమారు పదకొండు పన్నెండు రోజులకు - బ్రహ్మాండమైన డిన్నర్ ఏర్పాటు చెయ్యండి. మీ నోపికున్నంత మందిని పిల్చి డిన్నరే ఇస్తారో, లంచే ఇస్తారో మీ యిష్టం."

నవ్వేడు. "తప్పక!" అన్నాడు. అయితే అతని మనసులో ఒక మాట మెదుల్తోంది. అది ఆవిడకి చెప్పాలా వద్దా అన్న సందిగ్ధం. చెపితే ఎగతాళి చేస్తుందేమో? ఈ పదిహేను రోజుల్లోనూ ఆ భావం మరీ గుండెల్లో గూడుకట్టుకుని తతపోరుతోంది - తొందరగా బయటపడతాను - అని.

దాన్ని చాలా మంది సూతారంగా "ఐ లవ్ యూ" అంటారు.

* * *

ఆ మాట తన పెదవి దాటక ముందే ఇలా వెళ్ళిపోతుందని అనుకోలేదు.

ఆమె చనిపోవడమే షాక్ అయితే, అది ఆత్మహత్య అని తెలిసిన శంకర్ మరింత విలవిల్లాడి పోయాడు. తన పక్కన టీపాయ్ మీద రాసి పెట్టిన ఉత్తరమేగాక జిల్లా కలెక్టరుకూ, పోలీసు సూపర్నెంటుకీ, డి.ఎస్.పి.కీ, ఆ ఏరియా సర్కిల్, సబ్ ఇన్‌స్పెక్టర్లకి గూడా - విరక్తితో ఆత్మహత్యకు పాల్పడ్డాననీ, అందుకెవరూ బాధ్యులుకారని క్లుప్తంగా రాసి పోస్టులో పంపింది.

ఇదొక మిస్టరీ - ఎందుకు విరక్తి చెందిందో ఎవరూ వూహించలేనిదై పోయింది.

శంకర్‌కి అందిన వుత్తరంలో మాత్రం ఇలా వుంది.

—

నమస్తే!

చావు అనివార్యం. అదెప్పుడు వస్తుందో తెలియకపోవడం మనిషికొక వరం. కాని - నా చావుకి ముహూర్తం నాకు ముందే తెలిసిపోయింది. ప్రపంచంలో ఏ మందూ నన్ను మునలితనం దాకా బతికించలేదనీ, మహా అయితే మరో నాలుగైదు నెలలు బతుకుతాను తప్ప - చేసేదేమీ లేదని చేతులెత్తేశారు డాక్టర్లు.

ఇది తెలిసిన రెండ్రోజులకి సుబ్బారాయుడిగారి ఫిలిం బాక్సుల నిర్వాకం - మీ మీద జోక్సుగా చెప్పుకోవడం చూశాను. అదే కాదు - మీ పని మీరు చేసుకుపోవడం తప్ప - ఇతర్లని వేలెత్తి చూపని మీ మనస్తత్వమూ చూసినదాన్ని.

తోటి మనిషికి బాధ కలిగితే - వీళ్ళకి నవ్వొస్తుందా? ఎంత సాడిజం?

అప్పుడే అనిపించింది - ఎలాగూ వెళ్ళిపోయేదాన్ని, పోయేముందు మీకేదైనా చిన్నిమేలు చేసిపోతే ఎలా వుంటుందనీ, తిరిగి మీ చేతనే ఆ నవ్విన వాళ్ళ మొహాలు తెల్లబడేలా ఎందుకు చేయరాదనీను!

అప్పట్నుంచి నా శాయశక్తులా కృషి చేశాను.

నా కృషి ఫలించింది - కాని ఇక మిగిలిపోయింది - సూపర్‌హిట్.

సినిమాలో ఆత్మహత్య చేసుకున్న హీరోయిన్, నిజంగానే ఆత్మహత్య చేసుకుందని రేపు పేపర్లో చదివే జనం, నా వాగ్దానాన్ని నెరవేరుస్తారన్న భరోసా నాకు వుంది. సెంటిమెంటల్సు కదా! అందునా తెలుగు వాళ్ళు!!!

మీ మనస్సులో "ఐ లవ్ యూ" వుంది. దాన్నలాగే వుంచి నన్ను మాత్రం మనస్ఫూర్తిగా మన్నించండి. ఎందుకంటే అన్ని బంధాలు తెంచుకు పోవలసినదాన్ని. పెంచుకున్నా ప్రయోజనం లేక, చావుకి ఎదురుచూడలేక ఎదురు వెళ్తున్నదాన్ని.

హఠాత్తుగా నేనే వచ్చి మిమ్మల్ని కలుసు కున్నాను.

అలాగే వెళ్ళిపోతున్నందుకు - బాధ పడొద్దు.

— రాణి

రాణి చెప్పినట్లే ఆ సినిమా సూపర్‌హిట్.

కానీ ఆ తర్వాత అతన్నించి మరికొన్ని సూపర్‌హిట్స్ ఆశించిన జనానికి, కనీసం అసిస్టెంట్‌గా కూడా అతని పేరు తెర మీద కనబడలేదు.

అంతేకాదు - అతనెక్కడికి వెళ్ళాడో, ఏం చేస్తున్నాడో - పరిశ్రమలో వున్న తోటి వాళ్ళకి కూడా ఈ నాటికీ తెలియదు.